సేవలు కోత.. ప్రజలకు వాత

- సచివాలయాల్లో వింత పరిస్థితులు
- తాజాగా రెండింటిని కలిపి క్లస్టర్‌గా మ్యాపింగ్
- సచివాలయ సిబ్బంది కుదింపు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజల వద్దకే సేవలు
- కొవ్వూరు డివిజన్‌లో 197 గ్రామ సచివాలయాలు


నిడదవోలు మండలం సింగవరం గ్రామ సచివాలయ భవనం

నిడదవోలు రూరల్: వైఎస్సార్ సీపీ పాలన ముద్ర ప్రజలపై ఉండరాదని కూటమి ప్రభుత్వం కక్ష సాధిస్తోంది. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రిక అయిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తోంది. వీటి ద్వారా ప్రజలకు అందించే సేవల్లో కోత విధించింది. తాజాగా రెండు సచివాలయాలను కలిపి ఓ క్లస్టర్‌గా ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. పర్యవసానంగా ప్రజలు మళ్లీ సమస్యల పరిష్కారం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

గతంలో రెండు వేల జనాభాకే..

మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం దిశగా గత ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారు. ప్రతి రెండు వేల జనాభాకు ఓ సచివాలయం చొప్పున కొవ్వూరు డివిజన్ పరిధిలోని నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల పరిధిలోని మండలాల్లో 197 గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థ అందుబాటులోకి రావడంతో ప్రజలకు కలిగిన ప్రయోజనం అంతా ఇంతా కాదు. ప్రతి పనికి మండల కేంద్రానికి రావాల్సిన అవసరం తప్పింది. ప్రతి గ్రామంలో ఎక్కడికక్కడే సేవలు పొందే పరిస్థితి వచ్చింది. దీనివల్ల సంక్షేమ పథకాలు కూడా అర్హులకు ఇంటి ముంగిటకే చేరేవి. కానీ కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేస్తోంది.

కొత్తగా క్లస్టర్ల ఏర్పాటు

సచివాలయ వ్యవస్థను క్లస్టర్లుగా మార్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కూటమి ప్రభుత్వ ఆదేశాలతో ప్రతి రెండు సచివాలయాలను ఓ క్లస్టర్‌గా మార్చి, మ్యాపింగ్ చేస్తున్నారు. నిడదవోలు మండలంలో కంసాలిపాలెం, రావిమెట్ల కలిపి ఓ క్లస్టర్, తిమ్మరాజుపాలెం, సూరాపురం, ఉనకరమిల్లి, కాట కోటేశ్వరం గ్రామాలను మరో క్లస్టర్, సింగవరం, తాళ్లపాలెం, శెట్టిపేట క్లస్టర్, విజ్జేశ్వరం, గోపవరం కలిపి క్లస్టర్, పురుషోత్తపల్లి, డి.ముప్పవరం కలిపి క్లస్టర్, పందలపర్రు, కోరుపల్లి కలిపి క్లస్టర్, పెండ్యాల, మునిపల్లి, కలవచర్ల కలిపి క్లస్టర్లుగా ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ప్రతి సచివాలయ పరిధిలో ప్రస్తుతం 11 మంది ఉద్యోగులుండగా, క్లస్టర్ల ఏర్పాటుతో పంచాయతీ కార్యదర్శి గ్రేడ్ 1–5, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్, గ్రామ మహిళా పోలీస్ అందుబాటులో ఉంటారు.

ప్రజలకు తప్పని ఇబ్బందులు



గ్రామ సచివాలయాలను క్లస్టర్లుగా ఏర్పాటు చేస్తే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పవు. గతంలో సచివాలయాల్లో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఉండటంతో ప్రజలకు పౌర సేవలు సత్వరం అందేవి. ఇకపై సచివాలయ ఉద్యోగుల కోసం నాలుగైదు కి.మీ. వెళ్లి పనులు చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి. ప్రభుత్వం పునరాలోచించి సచివాలయ ఉద్యోగులను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలి.

– తిక్కా శ్రీనివాస్, సర్పంచ్, విజ్జేశ్వరం

కొవ్వూరు డివిజన్‌లో సచివాలయాల వివరాలు

మండలం	ప్రస్తుతం ఉన్న సచివాలయాలు
కొవ్వూరు	19
కొవ్వూరు పట్టణం	10
చాగల్లు	18
తాళ్లపూడి	15
దేవరపల్లి	21
గోపాలపురం	18
నల్లజర్ల	22
నిడదవోలు	22
నిడదవోలు పట్టణం	13
ఉండ్రాజవరం	19
పెరవలి	20

మిగిలిన వీఆర్వో, ఏఎన్‌ఎం, సర్వే అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, వ్యవసాయ(అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్), పశు సంవర్ధకశాఖ (వెటర్నరీ, ఫిషరీస్), ఎనర్జీ అసిస్టెంట్లు ఇకపై క్లస్టర్ పరిధిలో విధులు నిర్వహించాల్సి ఉంది. సగం పైగా సచివాలయ పరిధిలో ఉద్యోగులు అందుబాటులో ఉండకపోవడంతో ప్రజలకు అందించే క్షేత్ర స్థాయి సేవలపై తీవ్ర ప్రభావం చూపనుంది.

అరకొర సేవలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయాల సేవల్లో తీవ్రంగా కోతలు విధిస్తోంది. దీంతో ప్రజలు మీ–సేవా కేంద్రాలను ఆశ్రయించాల్సి వస్తోంది. గతంలో 545 సేవలను ప్రజలకు అందించగా, ప్రస్తుతం 173 సేవలు మాత్రమే అందుతున్నాయి. ప్రధానంగా ఆధార్ సంబంధిత సేవలు నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

క్లుప్తంగా

వైభవంగా సోమేశ్వరుని కల్యాణం


సోమేశ్వరస్వామి కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

నిడదవోలు: పట్టణ నడిబొడ్డున ఉన్న బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామివారి ఆలయ ఆవరణలో మంగళవారం రాత్రి బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామివారి దివ్య కల్యాణాన్ని వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు జరిగాయి. గణపతి పూజలు, ఉపన్యాసం, మండపారాధనలు చేశారు. పట్టణ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈవో సోమాల శివ, ఆలయ ప్రధానార్చకులు శ్రీకాకుళపు లక్ష్మీనరసింహశాస్త్రి, అభిరామ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల సీఐగా రాంబాబు



నల్లజర్ల: కొత్త సీఐగా వై.రాంబాబు నల్లజర్లకు నియమితులయ్యారు. రాజమహేంద్రవరం త్రీటౌన్ క్రైం స్టేషన్ నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. మంగళవారం సాయంత్రం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన విజయశంకరం రాజమహేంద్రవరం వన్ టౌన్ క్రైం స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

చాగల్లు: బ్రాహ్మణగూడెంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో వార్షిక మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గారపాటి శ్రీనివాసరావు, విజయదుర్గ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సాయిబాబాకు గణపతి పూజ, అఖండ దీపారాధన, ఆరాధనలు, క్షీరాధివాసం, నీరాజన మంత్ర పుష్పాలు నిర్వహించారు. స్వామివారి గ్రామోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మందిరాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. పూర్ణాహుతి, అన్న సమారాధన జరిగాయి.

అమ్మవారి విగ్రహ ఊరేగింపు

చాగల్లు: ఊనగట్లలో నూతనంగా నిర్మిస్తున్న పుంతలో ముసలమ్మ అనే కనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా అమ్మవారి విగ్రహాన్ని మంగళవారం ఘనంగా ఊరేగించారు. బ్రాహ్మణగూడెం, ఎస్.ముప్పవరం తదితర గ్రామాల్లో ఊరేగింపు కొనసాగింది. భజన సమాజం ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ మహోత్సవాలు ఈ నెల 31 నుంచి వచ్చే నెల 3 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పేదలకు వస్త్ర పంపిణీ


పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఫాదర్ జాన్‌పీటర్

దేవరపల్లి: నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్రంలోని పేదలకు, వలంటీర్లకు పుణ్యక్షేత్రం డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ ఎస్.జాన్‌పీటర్ వస్త్రాలు, పండ్లు, కేక్‌లు పంపిణీ చేశారు. జాన్‌పీటర్ గురుపట్టాభిషేకం జరిగి 34 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ జాన్‌పీటర్ కేక్ కట్ చేసి భక్తులకు పంచారు. ఈ సందర్భంగా ఫాదర్ జాన్‌పీటర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ జ్ఞానానందం, ఫాదర్ గంతేడి జార్జి, ప్రసాద్ పాల్గొన్నారు.

వడ్లూరు ఎమ్మార్పీఎస్ కమిటీ నియామకం

ఉండ్రాజవరం: మండలంలోని వడ్లూరు గ్రామంలో ఎమ్మార్పీఎస్ సమావేశం మంగళవారం సంఘ మండల అధ్యక్షుడు సునీల్‌రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘ నియోజకవర్గ ఇన్‌చార్జి గాలింకి రాము మాదిగ, రాష్ట్ర నాయకులు దిద్దే మధుబాబు, మండల కార్యదర్శి మండవల్లి అనిల్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం వడ్లూరు గ్రామ కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా నందమూరి వినోద్, ఉపాధ్యక్షుడిగా లింగంకోటి నవీన్, కార్యదర్శిగా ఆబోతు ముత్యాలరావు, సహాయ కార్యదర్శిగా చదలవాడ ప్రసాద్, ట్రెజరర్‌గా చాపల సత్తిపండు, అధికార ప్రతినిధిగా ఉప్పాటి ఆదిత్య నియమితులయ్యారు.

మాదక ద్రవ్యాలతో నష్టాలు

ఉండ్రాజవరం: ప్రజల ఆరోగ్యాన్ని నిర్వీర్యం చేసే మాదక ద్రవ్యాలను పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నిడదవోలు ఎక్సైజ్ సీఐ జయరాం సతీష్ కోరారు. సారా రహిత సమాజం దిశగా ఏపీ కార్యక్రమంలో భాగంగా దమ్మెన్ను గ్రామంలో మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. సీఐ మాట్లాడుతూ, యువత వీటికి బానిస కావడం వల్ల వారి భవిష్యత్తు అధకారం అవుతుందన్నారు. ఎస్సై శ్రీనివాస్ బాలాజీ పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలసిన వనిత


తాడేపల్లిలో మాజీ సీఎం జగన్‌ను మర్యాదపూర్వకంగా కలసిన మాజీ మంత్రి వనిత

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మాజీ హోం మంత్రి, గోపాలపురం నియోజకవర్గం సమన్వయకర్త తానేటి వనిత, నియోజకవర్గంలోని పలువురు సర్పంచ్‌లు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ

నిడదవోలు: పట్టణంలో ఇంటి, ఖాళీ స్థలాల పన్నులపై ప్రభుత్వం 50 శాతం వడ్డీ రాయితీ కల్పించిందని మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి తెలిపారు. ఈ నెల 31లోపు ఆస్తి పన్నులు చెల్లించి ఈ రాయితీ పొందవచ్చన్నారు. పురపాలక సంఘంలో పేరుకున్న పన్ను బకాయిలను ఏక మొత్తంలో చెల్లించే వారికి 50 శాతం వడ్డీ రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే పన్ను బకాయిలు లేకుండా వడ్డీ కట్టిన వారికి కూడా ఇది వర్తిస్తుందని చెప్పారు. ఇప్పటికే వడ్డీతో కలిపి పన్ను బకాయిలు చెల్లించిన వారికి, రాయితీ సొమ్మును వచ్చే ఆర్థిక సంవత్సరానికి జమ చేస్తామన్నారు. సెలవు దినాల్లో కూడా మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు.

మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు


వీరకుమారి, సర్పంచ్, దేవరపల్లి

దేవరపల్లి: స్థానికంగా మంచినీటి సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టినట్టు సర్పంచ్ కడిమి వీరకుమారి తెలిపారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నందున భూగర్భ జలాలు కిందకు దిగడం వల్ల మోటార్లు తక్కువ నీరు తోడుతున్నట్టు తెలిపారు. అయినా ప్రజలకు మంచినీటి ఎద్దడి లేకుండా తొమ్మిది బోర్ల ద్వారా, ఎనిమిది ఓవర్ హెడ్ ట్యాంకులు, నాలుగు మినీ ట్యాంకుల ద్వారా మంచినీరు సరఫరా చేస్తున్నట్టు చెప్పారు. 24 గంటలు నీటి సరఫరా చేస్తున్నట్టు ఆమె తెలిపారు. పంచాయతీ పరిధిలో సుమారు 4,085 గృహాలు ఉండగా, 3,028 మంచినీటి కుళాయిలు ఉన్నట్టు ఆమె తెలిపారు. జలజీవన్ మిషన్ పథకంలో రూ.68 లక్షల వ్యయంతో కొత్తగా పైపులైన్ల నిర్మాణం చేసినట్టు ఆమె తెలిపారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు సహకారంతో రూ. 12 లక్షల వ్యయంతో యాదవోలు రోడ్డులో కొత్తగా బోరు వేసి, అక్కడ నుంచి చంద్రబాబు కాలనీకి జలజీవన్ మిషన్ పథకంలో రూ.8 లక్షలతో పైప్‌లైన్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. బోరు వద్ద షెడ్డు నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు మండల పరిషత్ నిధుల నుంచి ఎంపీపీ దుర్గారావు రూ.3.50 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. మంచినీటి సరఫరాలో ప్రజలను ఇబ్బంది పెడుతున్న సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇళ్ల వద్ద గల మంచినీటి కుళాయిలకు కార్కులు ఏర్పాటు చేసుకోవాలని, కార్కులు లేక పోవడం వల్ల కొన్ని ప్రాంతాల్లో నీరు వృథాగా పోతోందన్నారు. గ్రామంలో తొమ్మిది బోర్లు పనిచేస్తున్నప్పటికి మూడు బోర్ల ద్వారా మాత్రమే మంచినీరు సరఫరా జరుగుతోందని, మిగిలిన బోర్లు నుంచి సుద్దనీరు రావడం వల్ల తాగడానికి పనికిరావడంలేదని తెలిపారు.

సాయం పేరిట స్వాహా

- వరద సాయం బియ్యాన్ని జనసేన నేత బొక్కేసినట్టు ఆరోపణలు
- విజయవాడ వరద బాధితుల పేరిట బియ్యం సేకరణ
- గోపాలపురం నియోజకవర్గ నేత అమ్ముకుని.. సొమ్ము చేసుకున్నట్టు విమర్శలు
- మంత్రి కందుల దుర్గేష్‌కు చెప్పే చేశానన్న నాయకుడు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు జనసేన శ్రేణులు గతేడాది ఊరూరా తిరిగి బియ్యం సేకరించారు. ఇలా దాతలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యా సంస్థల నుంచి భారీఎత్తున బియ్యం సేకరించారు. చివరికి ఆ బియ్యాన్ని జనసేన నియోజకవర్గ నేత ఒకరు అమ్మేసి సొమ్ము చేసుకున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పుడీ విషయం బయటకు పొక్కడంతో.. ఆ సొమ్మును పార్టీకి విరాళంగా ఇస్తానని.. ఇదంతా మంత్రి కందుల దుర్గేష్‌కు చెప్పే చేశానని ఆయన తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. వివాదం ముదరడంతో రెండ్రోజుల క్రితం జంగారెడ్డిగూడెంలో దీనిపై పంచాయతీ జరిగిందని, అది సెటిల్ కాకపోవడంతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి వ్యవహారం తీసుకెళ్లినట్టు పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గంలో ఈ వ్యవహారం కలకలం రేపుతోంది.

అసలేం జరిగిందంటే..

విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికని జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు నేతృత్వంలో గతేడాది నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో భారీగా బియ్యం సేకరించారు. ఇలా సేకరించిన బియ్యాన్ని విజయవాడలో బాధితులకు పంచకుండా ఆయన విక్రయించి, ఈ సొమ్మును స్వాహా చేశారని ఓ వర్గం ఆరోపణలు గుప్పిస్తోంది. మరో వర్గం మాత్రం సొమ్ము తమ వద్దే ఉందని, పార్టీకి విరాళం ఇవ్వడానికి ప్రయత్నిస్తుంటే కుదరడం లేదని, మంత్రి కందుల దుర్గేష్‌కు విషయం చెప్పినట్టు ప్రచారం చేస్తోంది. విరాళం ఇవ్వడానికి తమను పవన్ కల్యాణ్ వద్దకు తీసుకువెళ్తారంటూ చెబుతోంది. నాలుగు నెలల క్రితం జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ద్వారకా తిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురం వచ్చినప్పుడు కూడా ఆయనకు చెక్కు ఇవ్వడం కుదరలేదా. అని ప్రత్యర్థి వర్గం నిలదీయడం గమనార్హం.

రూ.16 లక్షలకు అమ్ముకున్నారు!

జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు, ఆయన వ్యతిరేక వర్గం మధ్య ఈ విషయంలో కొద్ది రోజులుగా తారాస్థాయిలో వివాదం నడుస్తోంది. సేకరించిన బియ్యాన్ని రూ.10.27 లక్షలకు విక్రయించానని సువర్ణరాజు చెబుతుంటే.. రూ.16 లక్షలకు అమ్ముకున్నారని వ్యతిరేక వర్గం చెబుతోంది. దీనిపై పార్టీ జిల్లా నేతల వద్ద పంచాయతీ జరిగింది. ఈ నేపథ్యంలో.. రెండ్రోజుల క్రితం జంగారెడ్డిగూడెంలో జనసేన నాయకుడు కరాటం సాయి పార్టీ ఆదేశాలతో నియోజకవర్గ నేతలతో సమావేశం నిర్వహించారు. సువర్ణరాజు అనుకూల, వ్యతిరేక వర్గాలు ఘర్షణకు దిగడంతో అది రసాభాసగా మారింది. దీంతో కరాటం సాయి చేతులెత్తేసి జిల్లా ఇన్‌చార్జి నాదెండ్ల మనోహర్ దృష్టికి వ్యవహారం తీసుకెళ్తానని సమావేశం ముగించారు.

ఆయిల్‌పామ్ తోటలపై డ్రోన్ ఆధారిత పర్యవేక్షణ


అయ్యవరంలో డ్రోన్ సాయంతో ఆయిల్‌పామ్ తోటలను పరిశీలిస్తున్న నిపుణుల బృందం

నల్లజర్ల: త్రీఎఫ్ ఆయిల్‌పామ్ సంస్థ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ తోటలపై డ్రోన్ సాయంతో పంటల పరిశీలన కార్యక్రమాన్ని మంగళవారం అయ్యవరంలో ప్రారంభించారు. 2 వేల ఎకరాల ఆయిల్‌పామ్‌ను రెండు గంటల వ్యవధిలో పరిశీలన పూర్తి చేశారు. డ్రోన్‌తో తీసిన ఫొటోల ఆధారంగా ఆయా తోటల్లో ఏవిధమైన తెగుళ్లు ఉన్నాయి. పోషకాహార లోపాలు ఉన్నాయా, మొక్కలకు నీటిలభ్యత ఏవిధంగా ఉందనే విషయాలను నిపుణుల బృందం పరిశీలన చేసింది. డ్రోన్‌తో ఈ తరహా ప్రయోగాలు చేయడం బహుశా దేశంలోనే ఇదే ప్రథమమని త్రీఎఫ్ ఆయిల్‌పామ్ సంస్థ జనరల్ మేనేజర్ పి.విజయప్రసాద్ వివరించారు. ఈ తరహా ప్రయోగాల వల్ల పంటల ఆరోగ్యస్థితి, చీడపీడలు, తెగుళ్లు, ఆయిల్‌పామ్ చెట్టు గ్రహించిన నీటిస్థాయిని నిర్ధారించడం జరుగుతుందన్నారు. తద్వారా ఆయిల్‌పామ్ దిగుబడులు పెంచి రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యమన్నారు. ఈ ప్రయోగాల ద్వారా గమనించిన ఫలితాలను విశ్లేషించి రైతులకు తగిన సూచనలు, సలహాలు అందించడం జరుగుతుందన్నారు. ఇది ఆయిల్‌పామ్ చరిత్రలోనే ప్రప్రథమమన్నారు. ఈ ప్రయోగాత్మక ప్రాజెక్ట్‌లో 30 వేల హెక్టార్లలో 14 వేల మంది రైతులు, 21 వేల ప్లాట్లలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా డ్రోన్ ఆధారిత సేవలు భారతదేశం అంతటా విస్తరింపజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు త్రీఎఫ్ సంస్థ వ్యవసాయం విభాగం అధిపతి కిలారి శ్రీనివాసరావు వెల్లడించారు. కచ్చితమైన వ్యవసాయ పద్ధతులను ఎక్కువ మంది రైతులు ప్రయోజనం పొందేలా చూస్తున్నట్టు చెప్పారు.

ప్రజా సమస్యలపై ఏకరువు

వాడీవేడిగా చాగల్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం


సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

చాగల్లు: గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలపై మండల పరిషత్ సమావేశంలో సభ్యులు ఏకరువు పెట్టారు. చాగల్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా అపరిష్కృత సమస్యలపై సభ్యులు ధ్వజమెత్తి, అధికారులను నిలదీశారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మండలంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి మండలాభివృద్ధికి సహకరించాలని కోరారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలని అధికారులకు సూచించారు. రాయితీపై అందిస్తున్న సోలార్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఎస్సీ, ఎస్టీలకు దీనిని ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. జగనన్న కాలనీల్లో పిచ్చిమొక్కలు తొలగించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు.

నిధులు మంజూరు చేయాలి

నందిగంపాడు గ్రామంలో ఎనిమిదో వార్డులో తాగునీటి కోసం బోర్ ఏర్పాటుకు, డ్రైన్లు, రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ కుదప రాంబాబు కోరారు. చంద్రవరం ఎంపీటీసీ గారపాటి నరసింహమూర్తి, సర్పంచ్ మద్దిపాటి శ్రీరామమూర్తి మాట్లాడుతూ, వాడపల్లి–చంద్రవరం, చంద్రవరం–మద్దూరు రహదారిలో ఆక్రమణలు తొలగించి, పాడైన సీసీ రోడ్లను అభివృద్ధి చేయాలని కోరారు. పేముల కాలువలో గౌరిపల్లి నుంచి దారవరం వరకున్న గుర్రపు డెక్కను తొలగించాలని సభ్యులు కోరారు. దీనివల్ల ఏటా వర్షాకాలంలో పొలాలు ముంపు బారిన పడుతున్నాయన్నారు. ఇరిగేషన్ జేఈ ఏడుకొండలు ఇచ్చిన సమాధానంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చిక్కాల నుంచి రాజమహేంద్రవరానికి ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయాలని సర్పంచ్ కొయ్యే మణి కోరారు.

రహదారులు అభివృద్ధి చేయాలి

చిక్కాలపాలెం నుంచి దేచర్లకు తారురోడ్డు నిర్మించాలని, గ్రామంలో చెరువు పూడికతీత చేపట్టాలని ఎంపీటీసీ సభ్యులు పిల్లి తిరుమలరావు కోరారు. ఊనగట్ల గ్రామంలో ప్రధాన కూడలి నుంచి గ్రామంలోకి వచ్చే రహదారిని విస్తరించాలని ఎంపీటీసీ సభ్యులు ఆత్కూరి గోపీచంద్ విజ్ఞప్తి చేశారు. మల్లవరంలో అసంపూర్తిగా ఉన్న డ్వాక్రా భవనానికి నిధులు మంజూరు చేసి, నిర్మాణం పూర్తి చేయాలని మల్లవరం ఉప సర్పంచ్ కోడూరి కాశీ అన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, తహసీల్దార్ ఎం మెరికమ్మ, ఎంపీడీవో ఆర్.శ్రీదేవి, ఎంపీటీసీలు ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు, ఉన్నమట్ల విజయకుమారి, ముప్పిడి మహాలక్ష్ముడు, ఇంటి కృష్ణవేణి, ఎస్కే పాషా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు అవమానం: ఒకరి అరెస్ట్

నల్లజర్ల: మండలంలోని దూబచర్ల గాంధీకాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి, ముసుళ్లగుంటలో ఎన్టీఆర్ విగ్రహాలకు చెప్పుల దండలు వేసి అవమానపర్చిన కేసులో పుల్లలపాడుకు చెందిన బుడిగిన బాజ్జిని మంగళవారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేసి తాడేపల్లిగూడెం కోర్టుకు తరలించినట్టు సీఐ వై.రాంబాబు తెలిపారు. అయితే ఈవిషయంలో వాస్తవం లేదని కావాలనే వైఎస్సార్ సీపీ కార్యకర్తను అక్రమంగా ఈ కేసులో ఇరికించారని మండల వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రమణ్యం ఆరోపించారు. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించి తమ కార్యకర్తకు న్యాయం చేస్తామని వెల్లడించారు.

ప్రతిభా పరీక్షల్లో చాంపియన్ ఉండ్రాజవరం స్కూలు


ఉండ్రాజవరం స్కూలు విద్యార్థులకు కప్ అందజేస్తున్న ఎంఈవోలు సక్సేనారాజు, శారద జ్యోత్స్న

ఉండ్రాజవరం: దాదాపు మూడున్నర దశాబ్దాలుగా ప్రతిభా పోటీ పరీక్షలు మండల స్థాయిలో నిర్వహించడం అభినందనీయమని ఎంఈవో సీహెచ్ సక్సేనారాజు అన్నారు. దివంగత గన్నమని శేషగిరిరావు స్మారక ప్రతిభా పోటీ పరీక్షలు–2025 విజేతలకు బహుమతీ ప్రదాన కార్యక్రమం మంగళవారం స్థానిక మండల విద్యా శాఖ కార్యాలయంలో నిర్వహించారు. ఎంఈవో–2 శారద జ్యోత్స్న మాట్లాడుతూ, విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి పరీక్షలు దోహదపడతాయని తెలిపారు. మండల స్థాయిలో చాంపియన్‌గా ఉండ్రాజవరం ఎంపీపీ స్కూల్ ఎంపికైంది. సబ్జెక్టుల్లో తొలి మూడు స్థానాలు వచ్చిన విద్యార్థులకు ఎంఈవోలు, హెచ్‌ఎంలు బహుమతులు అందజేశారు. అనంతరం కోమట్లపల్లి వివేక్ జ్ఞాపకార్థం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు తండ్రి వెంకట సుబ్బారావు పాఠశాల స్థాయిలో ప్రతిభ చూపిన పది మంది విద్యార్థులకు నగదు, జ్ఞాపికలు అందించారు.

కమిషనర్‌కు దరఖాస్తుల అందజేత

కొవ్వూరు: బీసీ చేతి వృత్తిదారులకు ఆదరణ ఫేజ్–3 ద్వారా ఉపాధి పరికరాలు అందజేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. మంగళవారం నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు కమిషనర్‌ను కలిసి దరఖాస్తులు అందజేశారు. చేతివృత్తిదారులకు మారుతున్న కాలానికి అనుగుణంగా పరికరాలను అందించడం ఈ పథకం ముఖ్యోద్దేశమన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, సంఘ ప్రతినిధులు మేడూరి వీర్రాజు, కోడూరి రాము, పట్నాల శ్రీనివాస్, చింతలపూడి ప్రసాద్, పట్నాల వీరన్న, వేములూరి సూరిబాబు, నమ్మాల రమణ, అలజింగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

27న ఆలయ హుండీ లెక్కింపు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం గ్రామంలో ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయ హుండీని ఈ నెల 27న లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ మంగళవారం తెలిపారు. ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభిస్తారని చెప్పారు.

పురుషోత్తపల్లిలో చోరీ

నిడదవోలు రూరల్: మండలంలోని పురుషోత్తపల్లిలో చోరీ ఘటనపై కేసు నమోదు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై కె.వీరబాబు మంగళవారం తెలిపారు. ఆయన వివరాల మేరకు, పురుషోత్తపల్లికి చెందిన గుర్రం వీరవెంకట నాగేశ్వరరావు గత నెల 22న శుభకార్యం కోసం కర్ణాటక రాష్ట్రం వెళ్లారు. దొంగలు ఇంటి తాళం పగులగొట్టి టీవీతో పాటు, బీరువాలోని రూ.10 వేల నగదు, వెండి పట్టీలను అపహరించారు. బాధితుడు నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి మాస కల్యాణం

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామి, అమ్మవార్లకు మాస కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కల్యాణం తిలకించడానికి భారీగా భక్తులు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ మాట్లాడుతూ, పవిత్రమైన ఈ కల్యాణం ప్రతి నెలా జరుపుతామని, ఆలయ అభివృద్ధికి నిత్య గోత్రనామార్చన, లక్ష తులసి పూజలు, హోమాలు, అన్న సమారాధన వంటి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు.